క్లుప్తంగా

పేదల ఆరోగ్యానికి పెద్దపీట



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్‌కు చెందిన రాజేందర్‌రెడ్డి కూతురు రిషికరెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.4లక్షల ఎల్‌ఓసీని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆశన్నగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

శంకర్‌పల్లి: ఫర్టిలైజర్ దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాలకు సంబంధించి పక్కా రికార్డులను మెయింటెన్ చేయాలని, అదేవిధంగా రైతులకు విధిగా రశీదులు అందించాలన్నారు. డబ్బులకు ఆశపడి నకిలీ విత్తనాలను అమ్మితే పెద్దఎత్తున జరిమానాతో పాటు కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చందు

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ సంస్థ పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను తగ్గించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చందు డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు డిపో సీఐ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్‌పాస్ చార్జీలు ఇప్పటికే ఆకాశాన్ని అంటుతున్నాయని, మళ్లీ పెంచాలని చూడటం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్ హామీ కారణంగా వస్తున్న నష్టాలను పూడ్చుకునేందుకే విద్యార్థులపై భారం మోపుతున్నారన్నారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు వెంటనే తగ్గించాలని, లేనియెడల విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి నవీన్‌నాయక్, సాయి, మనోజ్, నవీన్, చరణ్ తదితరులు ఉన్నారు.

మంత్రి వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షలు

షాబాద్: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని బుధవారం నగరంలోని ఆయన నివాసంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు, పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బేగరి రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు మహేశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

కేశంపేట: కేంద్రంలో ప్రధాని మోదీ హయాంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్ల రాధిక అన్నారు. మండల కేంద్రంలో బుధవారం 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం సంకల్పంతో సాకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర కొమురయ్యతో పాటు రాధిక ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని వారు కోరారు. పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 21 యోగా డేను ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే 23న శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో రఘురాంగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచాయతీలలో ట్రాక్టర్లు నడపలేం

చేవెళ్ల: జీపీల నిర్వహణలో ఆర్థిక ఇబ్బందులతో పంచాయతీలో ఉన్న ట్రాక్టర్లను నడపలేమని కార్యదర్శులు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ విఠలేశ్వర్ జీకి వారు వినతిపత్రం అందించారు. తమ పరిస్థితిని అర్థం చేసుకొని వెసులుబాటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



బాకారం సమీపంలో అధ్వానంగా..



కంకరతేలిన ఎన్కెపల్లి–బాకారం రోడ్డు

అధ్వాన రోడ్లతో అవస్థలు

- నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం
- గుంతలు, కంకరతేలిన దారులపై నరకయాతన
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గుంతల వద్ద వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు రోడ్ల మరమ్మతులకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు అర్ధంతరంగా వదిలేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో..

మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి బాకారం వరకు రోడ్డు అభివృద్ధికి గతంలో రూ.1.30 కోట్లు సీసీఆర్ నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 2023 ఏప్రిల్ 16న అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పనులు ప్రారంభించారు. అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి నాగిరెడ్డిగూడ వరకు పనులు పూర్తి చేశారు. కానీ నాగిరెడ్డిగూడ నుంచి బాకారం వరకు రోడ్డు పనులను అర్ధంతరంగా వదిలేశారు. అదేవిధంగా హిమాయత్‌నగర్ చౌరస్తా నుంచి ఎన్కెపల్లి, బాకారం వరకు నిధులు మంజూరైనా డ్రీమ్ వ్యాలీ సమీపం వరకు పనులు పూర్తిచేశారు. దాదాపు 500ల మీటర్ల వరకు పనులను కాంట్రాక్టర్ అలాగే వదిలేయడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడని సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



నాగిరెడ్డిగూడ–బాకారం రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడడంతో రాత్రి, పగలు తేడా లేకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతులకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. పనులను పూర్తి చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి.

–కొత్తపల్లి తిరుపతిరెడ్డి, బాకారం

నరకయాతన పడుతున్నాం



ఎన్కెపల్లి–బాకారం రోడ్డు అధ్వానంగా మారడంతో నరకయాతన పడుతున్నాం. ఎన్కెపల్లి డ్రీమ్ వ్యాలీ సమీపం నుంచి బాకారం వరకు 500 మీటర్ల మేర రోడ్డు అడుగడుగునా గుంతలతో ప్రమాదాలకు గురవుతున్నాం.

– ఎలిగని వెంకటేశ్‌గౌడ్, బాకారం

త్వరలో పనులు ప్రారంభిస్తాం



అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి బాకారం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన మాట నిజమే. నాగిరెడ్డిగూడ నుంచి బాకారం వరకు బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. అదేవిధంగా డ్రీమ్ వ్యాలీ నుంచి బాకారం వరకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

–విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నందిగామ: వీర్లపల్లిలో లబ్ధిదారురాలికి ఇంటి మంజూరుపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చర్ల అంతిరెడ్డిగూడ, వీర్లపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నా కూడా రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు. వీర్లపల్లి గ్రామానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీడీఓ సుమతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు న్యాయం

కొందుర్గు: కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తంగెళ్లపల్లిలో బుధవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చెట్టు'బడి'ంది



పాఠశాల తరగతి గదుల ఎదుట పడిన వేపచెట్టు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగురోజుల క్రితం ఈదురు గాలులకు ఓ వేపచెట్టు నేలకొరిగింది. పాఠశాల తరగతి గదులకు అడ్డంగా పడడంతో విద్యార్థులు వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నా చెట్టును తొలగించకుండా అలాగే వదిలేశారు. బుధవారం హెచ్‌ఎం పాఠశాలకు వచ్చినా చెట్టును పట్టించుకోకపోవడం శోచనీయం.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి



మొయినాబాద్‌రూరల్: అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీఓ జైసీ

షాద్‌నగర్‌రూరల్: తల్లితండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ సెక్టార్ పరిధిలోని కంసాన్‌పల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మ మాట– అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, లలిత, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో..

మొయినాబాద్‌రూరల్: చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని చేవెళ్ల సీడీపీఓ జైసీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు కవిత, లక్ష్మీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైసీ పాల్గొన్నారు. అనంతరవ ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు క్రమశిక్షణతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఆ యా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఎగ్ బిర్యానీ

కొందుర్గు: మండలంలోని పుల్సుమామిడి, సోమారంపహాడ్ గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న ప్రారంభించారు. అమ్మ మాట–అంగన్‌వాడీ బాటలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సేవలపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



షాద్‌నగర్: విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ మనోహర్ అన్నారు. ఎంఈఓ ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని సోలీపూర్, గంట్లవెల్లి, బూర్గుల తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తల్లితండ్రులతో మాట్లాడి సర్కారు బడుల్లో ఉన్న వసతులు, సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవికుమార్, సత్యం, వెంకట్, తిరుమలయ్య, సత్యం, జనార్దన్‌రెడ్డి, కృష్ణ, జ్యోతిర్మయి, లక్ష్మీదేవమ్మ, ప్రీతిబాల, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన

షాబాద్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు సింహాద్రినాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంకమ్మగూడలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే 10 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేట్ పాఠశాలకు వెళ్లకుండా గ్రామంలో ఉన్న పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులారా ఆలోచించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రైతులు తమ కాడెద్దులను, ఎడ్ల బండ్లను అందంగా అలంకరించారు. వారికి ఇష్టమొచ్చిన రంగులతో మెరుగులు దిద్దారు. అనంతరం దేవాలయాల వద్దకు బండ్లతో ర్యాలీగా వెళ్లారు. పంటలు బాగా పండి సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు.



కొందుర్గు: ముట్పూర్‌లో ఎద్దుల బండి ఊరేగింపు



షాబాద్: తాళ్లపల్లిలో కాడెద్దుల వద్ద రైతు

సాగులో మెలకువలు పాటిస్తే లాభాలు



పంటల మార్పిడి వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్త మహదేవప్ప, రైతులు

శాస్త్రవేత్త డాక్టర్ మహదేవప్ప

మొయినాబాద్‌రూరల్: పంటల సాగులో మెలకువలు పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీమహదేవప్ప అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ముర్తుజాగూడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహదేవప్ప మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో అధికారుల సూచనలు పాటించినప్పుడే అధిక లాభాలు పొందుతారన్నారు. భూసార పరీక్షలు, పంట మార్పిడి, రసాయన ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికంగా ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గుతుందని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకంతో ఖర్చు తగ్గడంతో పాటు నేల స్వభావాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయాదవ్, కో –ఆప్షన్ మెంబర్ రాంచంద్రారెడ్డి, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



పోలీసులకు చెక్కు అందిస్తున్న దాత కృష్ణారెడ్డి

చేవెళ్ల: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఏసీపీ కిషన్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కన్వెన్షన్ వద్ద బుధవారం పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాత చేవెళ్లకు చెందిన పద్మావతి కన్వెన్షన్ యజమాని ఎం.కృష్ణారెడ్డి, మాలతి దంపతులు 16 లక్షల రూపాయల చెక్కును ఏసీపీ, సీఐ భూపాల్‌శ్రీధర్‌కు వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు అడిగిన వెంటనే సామాజిక సేవా దృక్పథంతో ముందుకొచ్చిన మర్పల్లి మాలతికృష్ణారెడ్డి దంపతులను వారు అభినందించారు. దాత కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, లక్ష్మారెడ్డి, వెంకటేశ్, రవి, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, గని, మహేందర్ తదితరులు ఉన్నారు.

స్నేహితురాలికి ఆర్థికసాయం

షాబాద్: ఆపదలో ఉన్న స్నేహితురాలికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు తోటి మిత్రులు. మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1992–93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి శారద భర్త కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో వైద్యఖర్చులకు గాను ఆమెకు తోటి స్నేహితులు రూ.1లక్ష 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాష్ట్ర హాకీ అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్, రవీందర్‌గుప్తా, ఒగ్గ రాజు, విజయ్‌భాస్కర్, విష్ణుమూర్తి, మల్లేశ్, శ్రీనివాస్, అవేజ్, రామస్వామి, రాము, శ్రీధర్‌రెడ్డి, హైమావతి ఉన్నారు.

బీఆర్‌కే భవన్‌కు తరలిన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారణ పేరుతో వేధించాలని చూస్తే రాష్ట్ర ప్రజలు ఊరుకోరని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా బీఆర్కే భవన్‌కు వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు మద్దతుగా బుధవారం మాజీ ఎంపీపీ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. కేసీఆర్‌ను ఉద్దేశపూర్వకంగా వేధించాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మొయినాబాద్ నుంచి..

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండల, మున్సిపల్ పరిధిలోని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బీఆర్‌కే భవన్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొంపల్లి అనంత రెడ్డి, మండల అధ్యక్షులు దారెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాఘవ రెడ్డి, కొత్త మాణిక్‌రెడ్డి, కొత్త నర్సింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షాబాద్ నుంచి..

షాబాద్: మండలం నుంచి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దఎత్తున బీఆర్‌కే భవన్ తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చాంద్‌పాషా, రమేశ్‌యాదవ్, ఇమ్రాన్, యాదయ్య, దర్శన్, రాజుగౌడ్, పాండు, ముఖ్రంఖాన్, సందీప్ తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్‌రూరల్: తరలివెళ్తున్న నాయకులు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ చౌరస్తా నుంచి..

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

- రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- పాల్గొన్న అధికారులు, నాయకులు, రెవెన్యూ సిబ్బంది



శంకర్‌పల్లి: రైతుకు ప్రొసీడింగ్ కాపీని అందిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి



మొయినాబాద్: చిన్నషాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నందిగామ: మండల పరిధిలోని రంగాపూర్, బండోనిగూడలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రంగాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దారు రాజేశ్వర్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. రంగాపూర్‌లో 18, బండోనిగూడలో 27 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దారు లక్ష్మయ్య, ఆర్‌ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూభారతితో సమస్యల పరిష్కారం

షాబాద్: భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రికార్డుల్లో తప్పులను సరి చేసుకోండి

శంకర్‌పల్లి: భూ రికార్డుల్లో దొర్లిన తప్పులను రెవెన్యూ సదస్సుల్లో సరి చేసుకోవాలని తహసీల్దార్ సురేందర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని రావులపల్లిలో, మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 84 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ వెల్లడించారు. బుల్కాపూర్‌లో నిర్వహించిన సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిర్దవెల్లిలో..

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లిలో తహసీల్దార్ అజాంఅలీ ఆధ్వర్యంలో , వేములనర్వలో నాయబ్ తహసీల్దార్ గీత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. నిర్దవెల్లిలో 17, వేములనర్వలో 12 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు చెన్నకేశవులు, నివేదిత, సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని చిన్నషాపూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆర్‌ఐ రాజేశ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.